ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు - 2024

# ఆంధ్రప్రదేశ్ నేటి దుస్థితికి కారణమైన బిజెపిని, ప్రత్యక్షంగా పరోక్షంగా బిజెపికి కొమ్ముగాస్తున్న పాలక పార్టీలను ఓడించండి!

## సిపిఐ(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పిలుపు

**సార్వత్రిక** ఎన్నికలలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని పార్లమెంట్ స్థానాలతో పాటు, రాష్ట్ర శాసనసభకు కూడా మే 13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.

గత పది సంవత్సరాల కాలంగా కేంద్రంలో అధికారంలో నున్న బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్ర విభజన నుండి ఈనాటి వరకు ఆంధ్రప్రదేశ్‌ను మరింతగా దిగజార్చటానికి ప్రధాన కారణంగా ఉంది. దేశంలో మత మైనారిటీలపై దాడులకు తెగబడుతూ హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ, మత విద్వేషాల నడుమ నుండి ప్రజా వ్యతిరేక రాజకీయ ఆర్థిక విధానాలన్నింటిని నిరాటంకంగా నడిపించుకుంటూ వెళ్తోంది. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ రెండు విడతల ప్రభుత్వాలు ప్రారంభించి, అమలు చేసిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వేగవంతం చేస్తున్న ఛాంపియన్‌గా దోపిడీ వర్గాల విశ్వసనీయ ప్రతినిధిగా ఎన్డీఏ పాలన సాగిస్తోంది.

అయితే పాలకవర్గాలలోని ఒక సెక్షన్‌కే, ప్రధానంగా అంబానీ అదానీల వంటి గుజరాతీ బడా పెట్టుబడిదారీవర్గాలకే దోపిడీ అవకాశాలలో సింహభాగం కట్టబెడుతూ ఉంది. దీనితో ఇతర పెట్టుబడిదారులకు, వీరికి మధ్య వాటాల కోసం సాగుతున్న కుమ్ములాట.... పాలకపార్టీలు ఎన్నికలలో హోరాహోరీగా తలపడటం రూపంలో మనకు వ్యక్తం అవుతోంది.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.... రైతాంగం ఊపిరి తీసే మూడు సాగు చట్టాలను ముందుకు తెచ్చి, దీర్ఘకాల రైతాంగ ఆందోళన ఫలితంగా వెనక్కు తీసుకుంది. కార్మికుల కనీసపాటి హక్కులను కాలరాచే నాలుగు లేబర్ కోడ్‌లను వారిపై రుద్దింది. 'మానిటైజేషన్ పైప్ లైన్' (నగదీకరణ పథకం) పేరుతో, లాభాలతో నడుస్తున్న వానితో సహా, దేశంలోని పలు ప్రభుత్వరంగ, ప్రభుత్వ పరిశ్రమలను తెగ నమ్ముతోంది. విదేశీ బ్యాంకులలో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికి తెచ్చి ప్రతి భారతీయ పౌరుని ఖాతాలో 15 లక్షల రూపాయలు జమ చేస్తానంటూ ఆర్భాటంగా ముందుకు తెచ్చిన 'పెద్ద నోట్ల రద్దు' (డీ మానిటైజేషన్) ప్రహసనంగా వెల్లడైంది. పౌరుల ఖాతాలలోకి నగదేమీ జమ కాకపోగా, బడా సంపన్న వర్గాలు తమ వద్దనున్న నల్లధనాన్నంతా బ్యాంకుల ద్వారా తెల్లధనంగా మార్చుకునేందుకు ఇది తోడ్పడిందని వెల్లడయింది. 'ఒకే దేశం, ఒకే పన్ను' పేరుతో ముందుకు తెచ్చిన 'వస్తు సేవల పన్ను' (జిఎస్టి).... దిగువ, మధ్యతరగతి వ్యాపార వర్గాలను కోలుకోలేని దెబ్బతీసింది. వారి వ్యాపారాలు, పరిశ్రమలన్నీ కార్పొరేట్ శక్తులు కబళించేందుకే అది తోడ్పడింది. కరోనా సాకుతో వృద్ధులు, వికలాంగులకు, రైలు ప్రయాణాల్లో కల్పించే అతి కొద్ది రాయితీలను కూడా రద్దుచేసి, తదనంతర కాలంలోనూ వాటిని పునరుద్ధరించకపోగా, సామాన్యులు ప్రయాణించే ప్యాసింజర్ సర్వీసులన్నింటినీ రద్దుచేస్తూ, 'వందేభారత్' రైళ్ళతో హోరెత్తిస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయాణ సౌకర్యాలను కుదించివేసింది. పరిశ్రమలు, గనులు, అంతరిక్ష పరిశోధనలు, రైల్వే రక్షణ ఉత్పత్తులు, వార్తా ప్రసార విభాగాల నుండి సౌందర్య సాధనాలు, కిరాణా వ్యాపారం వరకు.... సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలతో ముంచెత్తుతోంది. నిరుద్యోగం మున్నెన్నటికంటే తీవ్ర రూపం దాల్చింది. ఎలాంటి శిక్షణా లేకుండా ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లలోని యుద్ధరంగాలలో పనుల కోసం యువత వెళ్ళడానికి తెగించడం – దేశంలో నిరుద్యోగ తీవ్రతను ఎత్తిచూపుతోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాసులు, నిత్యవసరాల ధరలు అనూహ్యంగా పెరిగిపోతూ సామాన్యుని జీవితం మరింత దుర్భరంగా మారుతోంది.

కోవిడ్ సమయంలో' ఆత్మ నిర్భర భారత్' పేరున, 'పిఎం కేర్స్' పేరున ప్రభుత్వం వద్ద పోగుపడిన లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ నిధులను, విరాళాలను కేంద్ర ప్రభుత్వం అప్పనంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టింది. మరోవైపున కోట్లాదిమంది కార్మికులను 'లాక్‌డౌన్ 'ప్రకటనతో ప్రయాణ సౌకర్యాలేమీ లేకుండాజేసి, హఠాత్తుగా వారిని రోడ్లపైకి నెట్టివేసింది. బడా పారిశ్రామిక వర్గాలకు ప్రతి ఏటా వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలను కల్పిస్తోంది. బ్యాంకులలోని ప్రజాధనాన్ని కొల్లగొట్టి, అప్పులు ఎగవేసి, విదేశాలలో విహరిస్తున్న బడా బాబుల రుణాలు రాబట్టేందుకు సిద్ధంకావటంలేదు. మరోవైపున, కరోనా కష్ట సమయంలోనూ పంటలు పండించి దేశానికి తిండి పెట్టిన రైతన్నలు కష్టాలతో, రుణభారాలతో నానా యాతనలు పడుతూ, ఒక్క పర్యాయం రుణాల రద్దు చేయమంటే కూడా అంగీకరించడానికి నిరాకరించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడానికి ససేమిరా సాధ్యం కాదంటోంది. కానీ, కేంద్రం ప్రతి ఏటా వేలకోట్ల రూపాయలను బడా పారిశ్రామికవేత్తల రుణబకాయిలను ఎన్ పి ఏ (నిరర్థక ఆస్తుల)

పేరున రద్దు చేస్తూ రావడం, వారి దోపిడీ వర్గ స్వభావాన్ని నానాటికీ బట్టబయలు చేస్తోంది. ప్రపంచ ఆకలి సూచీలో, 125 దేశాల జాబితాలో 111వ స్థానానికి దిగజారిన మన దేశం, 2019-23 మధ్యకాలంలో ప్రపంచ దేశాల జాబితాలో, ఆయుధాల దిగుమతిలో అగ్రభాగాన ఉండడం... దోపిడీ పాలకుల ప్రాధాన్యతలను తేటతెల్లం చేస్తోంది.

రాజ్యాంగంలోని 370, 35-ఏ అధికరణాలను అప్రజాస్వామికంగా రద్దుచేసి, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తోంది. ఈశాన్య రాష్ట్రాలలో, ప్రత్యేకించి మణిపూర్ కొండల్లో విలువైన ఖనిజ నిక్షేపాలను సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం, ఆ ప్రాంత ఆదివాసీలైన నాగా, కుకీలపైకి, మతోన్మాదం తలకెక్కించిన మైతీలను ఎగద్రోలి, పోలీసు మిలటరీ బలగాల ప్రత్యక్ష పర్యవేక్షణలో, స్థానిక బిజెపి రాష్ట్ర పాలకుల అండదండలతో, మానవహననం, అత్యాచారాలు,అరాచకాలను అంతులేకుండా సాగిస్తోంది.

బాబ్రీ మసీదును కూల్చిన స్థలంలోనే వేలకోట్ల రూపాయల వ్యయంతో రామాలయం నిర్మించి, దానిని అట్టహాసంగా ప్రారంభించి, ప్రజల్లో భావోద్వేగాలను పెంచుతూ, మధుర-కాశి-జ్ఞానవాపిలలోనూ వివాదాలను రేపుతోంది. పాక్, చైనాలతో సరిహద్దు వివాదాలతో జాతీయోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నది. సిబిఐ, ఈడి వంటి నిఘా, దర్యాప్తు సంస్థలన్నింటినీ తమ రాజకీయ ప్రయోజన సాధనాలుగా మలుచుకొని వ్యవహరిస్తోంది. ప్రత్యర్థి రాజకీయ పార్టీలపైనే కాక ప్రభుత్వ వ్యతిరేక, ప్రజాస్వామ్య గొంతుకలను, ఛానెళ్లను, ప్రజాస్వామిక వాదులను అణచివేస్తూ ఫాసిస్టు పాలన దిశగా వేగంగా కదులుతోంది.

సామ్రాజ్యవాదుల రాజకీయ ప్రయోజనాలలో భాగంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ విభజన తదనంతరము కూడా, విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మరింత అధోగతి పాలు చేసింది.

విభజన హామీలైన ప్రత్యేక హోదా, కడప స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం-నిర్వాసితుల పునరావాసం, రాజధాని అంశం వంటి ఏ ఒక్కదానినీ నెరవేర్చకపోగా, ప్రజలు ప్రాణత్యాగాలతో సాధించుకున్న 'విశాఖ ఉక్కు'ను ప్రైవేటీ కరించటానికి సిద్ధమవుతోంది.

ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో గత ఐదేళ్లుగా అధికారంలోనున్న వైసీపీ కానీ, నేడు బిజెపితో కలిసి కూటమిగా ముందుకు వస్తున్న టిడిపి జనసేనలు కానీ, విభజిత హామీల అమలు కోసం, కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టుకోవాల్సిన నిధుల కోసం, ఒకరిపై ఒకరు దిగజారుడు ప్రకటనలు.... బూటకపు హూంకరింపులు మినహా.. ఆచరణలో నిర్దిష్టంగా చేపట్టిన కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి లేకపోవడం శోచనీయం. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఇంతగా కాలరాస్తున్న బిజెపికి, ఈ రాష్ట్రంలో స్థానం కల్పించేందుకు అధికార వైసిపి, విపక్ష టిడిపి-జనసేనలు పూనుకోవటం సిగ్గుచేటైన విషయం.

ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కానీ... సంవత్సర కాలం పైగా దేశవ్యాప్తంగా సాగిన రైతాంగ ఉద్యమానికి సంఘీభావంగా కానీ... ప్రజలపై అత్యధిక భారాలను మోపిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్టిల అమలుకు వ్యతిరేకంగా కానీ... కార్మికుల కనీస హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ గానీ... రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, రాష్ట్రాల ఆర్థిక వనరులన్నింటిని కేంద్రం తన గుప్పెట పెట్టుకోవడాన్ని ఖండిస్తూ గాని... రాష్ట్రంలోని ఏకైక పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ స్టీలు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరింప చేయడానికి కానీ... ప్రజల భావోద్వేగాలతో చెలగాటమాడుతూ రాజధాని అంశాన్ని రాజకీయం చేయడంపై గాని... రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 కాదు 15 ఏళ్లు ఇవ్వాలని డిమాండ్ చేసి కూడా, కేంద్రంలో అధికారంలో ఉంటూ... ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని అధికారికంగా తెగేసి చెప్పటాన్ని నిరసిస్తూ కానీ... పోలవరం నిర్మాణం-నిర్వాసితుల అంశంలో కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టుకోవాల్సిన నిధుల మంజూరు కోసం గానీ... ఆదివాసులను శాశ్వతంగా అడవుల నుండి గెంటివేసి, అడవులను, అడవులలోని ఖనిజ సంపదలను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిన అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని, జీవవైవిధ్య, పర్యావరణ చట్టాల సవరణలను గాని... దేశవ్యాప్తంగా ప్రజలు ప్రజాస్వామికవాదులు మీడియా సంస్థలపైనే గాక ముఖ్యంగా మణిపూర్ ఆదివాసి మహిళలపై జరిగిన అత్యంత ఘోరమైన దాడులకు, అకృత్యాలకు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా గాని... దేశ ప్రజలలో ముస్లిం మైనారిటీల పట్ల వివక్షత చూపుతూ పొరుగు దేశాల నుండి వచ్చిన వారిలో ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం ఇస్తామంటూ ఎన్నికల ముందు అమలుకు పూనుకున్న 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఏఏ)కి వ్యతిరేకంగా కానీ... కనీసం పెదవి విప్పలేని, నోరు కదపలేనంతగా, బిజెపికి సాగిలపడిన వైసిపి, టిడిపి, జనసేనలు.... రాష్ట్ర ప్రయోజనాల కోసం అంటూ ఈనాడు గుండెలు బాదుకుంటున్నదంతా ప్రజలను వంచించేందుకు మినహా వేరు కాదు. ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆత్మాభిమానం గురించి బడాయి మాటలు కాకుండా, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను గత పదేళ్లలో మరింత అధోగతి పాలు చేసిన బిజెపిని నిలవేయలేక పోవడానికి ఈ పార్టీలన్నింటికీ పరస్పర ప్రయోజనాలు ముడిపడి వుండటం, అవకాశవాద లొంగుబాటు రాజకీయ విధానాలే కారణం. రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన వీరు, ప్రజలను మాయజేసి వంచించేందుకు, ఒకరిని మించి ఒకరు ప్రజాకర్షక తాయిలాలను ప్రకటిస్తూ, ఓట్లను దండుకునేందుకు విచ్చలవిడిగా డబ్బు, మద్యాలను

పారిస్తూ ప్రజలను లోబరచుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలన రాష్ట్రాన్ని మరింత అప్పులమయం చేసింది. కేంద్ర బిజెపి ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పక అమలుచేయడంలో ముందుంది. ఒక క్రమంలో రైతులకు అందించే కనీసపాటి ఉచిత విద్యుత్తుకు కూడా ఖరీదు కట్టి వసూలు చేసేందుకు వీలుగా, జగన్ ప్రభుత్వం సాగు మోటార్లకు మీటర్లు బిగించాలననే ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలు చేయడంలో ముందు నిలిచింది. రాష్ట్రంలో మద్య నిషేధం దిశగా సాగుతామంటూ, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే, (బెల్టు షాపుల ద్వారా అదనం) మద్యం విక్రయాల ఆదాయాన్ని గతం కంటే పెంచి వేసింది. మద్యంపై వచ్చే ఆదాయాన్ని గ్యారెంటీగా చూపుతూ దానిపై రుణం తీసుకుని, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమని చెబుతూ ప్రజలను దగా చేస్తోంది. ఇసుక, ఖనిజాలు, గ్రానైటు వంటి సహజ వనరుల దోపిడీని ఇష్టారాజ్యంగా, చట్ట భీతి లేకుండా సాగించి, తమ అనుంగు రాజకీయ మాఫియా ముఠాలకు దోచిపెడుతోంది. గందరగోళపు అస్తవ్యస్త విధానాలతో విద్యారంగాన్ని, ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగాన్ని దెబ్బతీసింది. విద్యా రంగంలో కీలకమైన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా ఉపాధ్యాయులపై కత్తి దూసింది. వైసీపీ వాగ్దానం చేసిన విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్న డిమాండ్‌ను పరిష్కరించకుండా, దాని కొరకు సాగే ఆందోళనలను పోలీసు నిర్బంధంతో అణిచివేసింది. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామనే హామీని అటకెక్కించింది. కనీసపాటి నిరసనలు తెలిపేందుకు కూడా అవకాశం లేకుండా, 'జీవో నెంబర్ ఒకటి'తో ప్రజాస్వామిక హక్కులను హరించి వేసింది. ఏళ్ళ తరబడి, నెలల తరబడి ఆందోళనలు సాగిస్తున్న రాజధాని రైతులతో గాని, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులతో గాని కనీసం చర్చించడానికి కూడా పూనుకోలేదు. ప్రతి ఏటా 'జాబ్ క్యాలెండర్'తో లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి, నిరుద్యోగుల ఆందోళనలపై లాఠీలతో విరుచుకుపడింది. రాష్ట్రంలో ఓడరేవులు, పరిశ్రమలను సామ్రాజ్యవాద బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడంలో, వేలాది ఎకరాల భూములను వారికి తేరగా పంపిణీ చేయడంలో ముందుంది. గ్రామీణ ప్రాంతాల్లో.... దళితులపై, మహిళలపై, భూస్వామ్య పెత్తందారుల దాడులు, హత్యాచారాలు గణనీయంగా పెరిగేందుకు ప్రోత్సహిస్తోంది.

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పాలన సాగించిన నాటి చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి, బిజెపి, జనసేనల పాలన కూడా సారాంశంలో దీనికి భిన్నంగా ఏమీ లేదు.

ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్రస్తుత రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో **బిజెపిని; బిజెపికి పరోక్షంగా తోడ్పడుతున్న అధికార వైసీపీని; బిజెపితో నేరుగా జతకట్టిన టిడిపి, జనసేనల కూటమిని తిరస్కరించవలసిందిగా సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.** సామ్రాజ్యవాదులకు సేవ చేస్తున్న పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించాలని, ఎండగట్టాలని, ఏ పాలకపార్టీ అధికారంలోకి వచ్చినా సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలు సాగించటం మినహా మరో దగ్గరి మార్గమేదీ లేదని గ్రహించాలని, మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలపై మన పోరాటాన్ని ఎక్కుపెట్టాలని పిలుపునిస్తోంది. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారం కోసం... నూతన ప్రజాస్వామిక వ్యవస్థ దిశగా ఉద్యమించాలని పిలుపునిస్తోంది.

★★★★★